


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 162 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 17 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై అధ్యయనానికి మంత్రుల కమిటీ

**నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది.**

**అమరావతి, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్ఛార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

**కేబినెట్ సమావేశంలో ఆమోదించిన అంశాలివే..**

- ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్లు రుణం తీసుకోవడంపై ఆమోదం
- ఏపీ మార్క్ ఫెడ్కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనకు ఆమోదం
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్జీఎస్ ఏర్పాటుకు ఆమోదం
- తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదం
- కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం
- అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం
- ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం. విద్యుత్ సుంకంలో టారిఫ్ తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదం
- 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఆమోదం



### పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: సీఎం

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.

### సీఎం రేవంత్ సింగపూర్ పర్యటన..

# ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం

సీఎం రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో అక్కడి ఐటీఈతో(ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది.



**సింగపూర్, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి సింగపూర్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో అక్కడి ఐటీఈతో(ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్రెడ్డి, మంత్రి శ్రీధరాబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా ఐటీఈ పాఠ్యాంశాలను స్కిల్ వర్సిటీ ఉపయోగించుకోనుంది. ఈమేరకు స్కిల్ వర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం కుదిరింది. శుక్రవారం ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్తో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీలో పాల్గొన్నారు.

# భారత్ పెట్టుబడులకు స్వర్గధామం: ప్రధాని మోదీ

**భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.**

**దిల్లీ, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రారంభించారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్పో సెంటర్ మార్ట్ వేదికల్లో ఎక్స్పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం :రామ్మోహన్ నాయుడు

విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.




**దిల్లీ, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు.

# రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే : సీఎం చంద్రబాబు

**విశాఖ స్టీల్ ప్లాంటు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.**



**అమరావతి, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** విశాఖ స్టీల్ ప్లాంట్కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయం. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు" అని చంద్రబాబు అన్నారు.

# ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి: కేటీఆర్

కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.



**షాబాద్, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. "100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతు బంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలి" అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్ గౌడ్, పట్నం నరేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రెచ్చిపోయిన బీటెక్ రవి వర్గీయులు..

# ఎమ్మెల్సీ అనుచరుడిపై దాడి

**పులివెందుల తెదేపాలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. బీటెక్ రవి అనుచరులు మరోసారి రెచ్చిపోయారు.**





**పులివెందుల, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** పులివెందుల తెదేపాలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. బీటెక్ రవి అనుచరులు మరోసారి రెచ్చిపోయారు. తెదేపా ఎమ్మెల్సీ రాంగోపాల్రెడ్డి అనుచరుడు, వేంపల్లికి చెందిన ప్రకాశ్ రేషన్ దుకాణం కోసం పులివెందులలోని పాఠశాలలో పరీక్ష రాయడానికి వచ్చారు. ఈ క్రమంలో ఎగ్జామ్ రాసేందుకు వెళుతుండగా అతడిని బీటెక్ రవి అనుచరులు చితకబాదారు. ప్రకాశ్ను వదిలిపెట్టాలని ఎమ్మెల్సీ రాంగోపాల్రెడ్డి భార్య ఉమాదేవి ధర్నాకు దిగారు. పోలీసుల జోక్యంతో ప్రకాశ్ను వదిలేశారు. మరోవైపు గురువారం సాయంత్రం కలెక్టరేట్లో ఇసుక టెండర్ల కోసం బీటెక్ రవి అనుచరులు హంగామా సృష్టించారు. ఆ ఘటన మరవక ముందే శుక్రవారం పులివెందులలో మరోసారి రెచ్చిపోయారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1706: గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి బెంజమిన్ ఫ్రాంక్లిన్ జననం (మ.1790).
- 1905: ప్రసిద్ధ భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు దత్తాత్రేయ రామచంద్ర కప్రేకర్ జననం. (మ.1986).
- 1908: తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు మరియు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఎల్.వి.ప్రసాద్ జననం (మ.1994).
- 1917: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినిమా నటుడు, ఎం.జి.రామచంద్రన్ జననం. (మ.1987) (చిత్రంలో)
- 1951: భారతీయ సినిమా నటి బిందు జననం.
- 1989: మొదటిసారి ఒక భారతీయుడు – కల్నల్ జె.కె.బజాజ్ – దక్షిణ ధృవాన్ని చేరుకున్నాడు.
- 1997: ప్రవాస భారతీయులకు ద్వంద్వ పౌరసత్వం ఇచ్చేది లేదని భారత ప్రభుత్వం ప్రకటించింది.
- 2010: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన జ్యోతిబసు మరణం (జ.1914).


బెంజమిన్ ఫ్రాంక్లిన్


దత్తాత్రేయ రామచంద్ర



ఎల్.వి.ప్రసాద్



ఎం.జి.రామచంద్రన్


బిందు


భారత త్రివర్ణ పతాకం


భారతదేశం


జ్యోతిబసు

## రిపబ్లిక్ స్పోర్ట్స్

### ఖేల్ రత్న పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి

2024 ఏడాదికి గాను ఖేల్ర పురస్కారాలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు ప్రదానం చేశారు.

భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్చంద్ ఖేల్ రత్న పురస్కారాలనురాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో.. చెస్ ప్లేయర్ డి.గుకేశ్, హాకీ స్టార్ హర్మన్ ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, షూటింగ్లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఈ అవార్డులు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజీ దీప్తి (పారా అథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) పురస్కారాలను స్వీకరించారు. వీరితోపాటు మరో 32 మంది అర్జున, ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలు అందుకున్నారు. లైఫ్‌ఎం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), ఆర్మాండో ఆగ్నెలో కొలాకో (పుట్బాల్) పురస్కారాలు స్వీకరించారు.



#### అర్జున అవార్డులు అందుకుంది వీరే..

అన్ను రాణి (అథ్లెటిక్స్)
నీతూ (బాక్సింగ్)
స్వీటీ బురా (బాక్సింగ్)
వంతిక అగర్వాల్ (చెస్)
సలీమా (హాకీ)
అభిషేక్ (హాకీ)
సంజయ్ (హాకీ)
జర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ)
సుఖ్జీత్ సింగ్ (హాకీ)
స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్)
సరబ్జోత్ సింగ్ (షూటింగ్)
అభయ్ సింగ్ (స్క్వాష్)
సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)
అమన్ (రెజ్లింగ్)
రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్)
ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)
అజీత్సంగ్ (పారా అథ్లెటిక్స్)
సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్)
ప్రణవ్ సూర్య (పారా అథ్లెటిక్స్)
హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్)
సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్)
నవదీప్ (పారా అథ్లెటిక్స్)
నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)
తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)
నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)
మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్)
కపిల్ పర్మార్ (పారా జూడో)
మోనా అగర్వాల్ (పారా షూటింగ్)
రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్)

**అర్జున అవార్డ్స్ (లైఫ్ టైమ్)**
సుచా సింగ్ (అథ్లెటిక్స్)
మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్)

**ద్రోణాచార్య అవార్డులు (కోచ్లు)**
సుభాష్ రాణా (పారా షూటింగ్)
దీపాలీ దేశ్పాండే (షూటింగ్)
సందీప్ సంగ్వాన్ (హాకీ)

## అమెరికా టూ అనకాపల్లి..

### సంక్రాంతికి వస్తున్నాం మూడు రోజుల్లో రికార్డులివే!

'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. ఈసందర్భంగా నిర్మాత దిల్ రాజు ఆనందం వ్యక్తంచేశారు.



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.106కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతేకాదు, వెంకటేశ్- అనిల్ రావిపూడి హ్యాట్రిక్ కొట్టారు (ఎఫ్2, ఎఫ్3, సంక్రాంతికి వస్తున్నాం). మూడుసార్లు రూ.100 కోట్లకు పైగా వసూలుచేసిన కాంబినేషన్ గానూ ఈ జోడీ నిలిచింది. అమెరికాలోనూ ఈ చిత్రం మంచి వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో 1 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అనిల్ రావిపూడి సంతోషం వ్యక్తంచేశారు. తాను దర్శకత్వం వహించిన గత నాలుగు చిత్రాలు వరుసగా మిలియన్ డాలర్లతో పాటు, రూ.100 కోట్లు వసూలుచేశాయని, ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' అయిదో చిత్రమని ఆనందం వ్యక్తంచేశారు. ఇక బుక్మై షోలోనూ ఈ మూవీ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. మూడు రోజుల్లో 1.5 మిలియన్ టికెట్లు విక్రయమైనట్లు బుక్ మై షో తెలిపింది. ఒకవైపు సంక్రాంతి సెలవులు, మరోవైపు వీకెండ్ కలిసి రావడంతో థియేటర్లకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా ఏపీ, తెలంగాణాల్లో 220ప్లస్ షోలను అదనంగా ప్రదర్శిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

'సంక్రాంతికి వస్తున్నాం' మూవీకి అమెరికాలో లభిస్తున్న ఆదరణకు నిర్మాత దిల్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు స్పెషల్ వీడియోను విడుదల చేశారు. "అమెరికాలో ఉన్న తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ పండగకు వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా రెండు రోజుల్లోనే 1 మిలియన్ డాలర్లు వసూళ్లు రాబట్టింది. హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, మా చిత్ర నిర్మాణ సంస్థకు బ్లాక్బస్టర్ ఇచ్చినందుకు ధన్యవాదాలు. అమెరికా నుంచి అనకాపల్లి వరకూ, అమలాపురం నుంచి ఆస్ట్రేలియా వరకూ ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తూ మాకు సరికొత్త శక్తిని ఇచ్చిన వారందరికీ థ్యాంక్యూ" అని అన్నారు

## రిపబ్లిక్ సినిమా CINEMA

### సైఫ్ పై దాడి.. ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సైఫ్ పై దాడి ఘటనతో ప్రమేయం ఉన్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దాడి ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తోన్న విషయం తెలిసిందే. దాడికి పాల్పడిన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తోన్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాంద్రాలోని పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లి అతడిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నారు. దాడి చేయడానికి గల కారణమేమిటన్న కోణంలో విచారిస్తున్నారు.

#### 20 బృందాలుగా పోలీసులు:

గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని విధాలుగా దర్యాప్తు చేపట్టారు. నిన్న రాత్రి నిందితుడి ఫొటోను రిలీజ్ చేశారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు 20 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. బాంద్రా రైల్వేస్టేషన్ వద్ద అతడు చివరిసారి కనిపించాడని పోలీసులు తెలిపారు. ఘటన తర్వాత అతడు వసాయి-విరార్ ప్రాంతాలవైపు లోకల్ ట్రైన్లో ప్రయాణం చేసినట్లు వారు అనుమానిస్తున్నారు.

#### ఆస్పత్రిలో సైఫ్..:

ఈ దాడిలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. లీలావతి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స చేసి 2.5 అంగుళాల బ్లేడ్ ముక్కను వైద్యులు బయటకు తీశారు. ఎడమ చేతికి, మెడ కుడి భాగానికి అయిన గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేశారు. సైఫు ప్రాణాపాయం లేదని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీరజ్ ఉత్తమాని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలోనే ఉన్నారని ఇంకొన్ని రోజులు అక్కడే ఉండే అవకాశం ఉందని సమాచారం.

### 'కంగువా' సౌండ్ పై విమర్శలు.. స్పందించిన దేవీశ్రీ ప్రసాద్

సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కంగువా'. ఎపిక్ ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల్లో భరించలేనంత సౌండ్ను ఉపయోగించారని కొందరు విమర్శించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ విమర్శలపై ఆ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీ ప్రసాద్ స్పందించారు. మనం ఏది చేసినా విమర్శించేవారు ఉంటారని చెప్పారు. ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన దేవీశ్రీ ప్రసాద్ కంగువా సినిమా సౌండ్పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శల గురించి మాట్లాడారు. "నేను సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ను పట్టించుకోను. నా పని నేను చేసుకుంటూ వెళ్తాను. సోషల్ మీడియాలో పెట్టే ప్రతి పోస్ట్ను పరిశీలించే సమయం ఉన్నప్పటికీ.. మనం ఏది చేసినా విమర్శించేవారుంటారు. 'కంగువా' ఆల్బమ్ నాకు చాలా ఇష్టం. అందులోని 'మణిప్పు..' పాటపై ప్రశంసలు వచ్చాయి. అలాగే సూర్య అభిమానులు ఎంతోమంది ఇందులోని పాటలను సెలబ్రేట్ చేసుకున్నారు. సూర్య కూడా నాకు ఫోన్ చేసి పాటల గురించి అరగంట మాట్లాడారు. నా వర్క్ను ప్రశంసించారు. మేమంతా ఎంజాయ్ చేసిన సినిమా ఇది. ప్రతి సినిమాలో మంచి చెడులు ఉంటాయి. 'కంగువా' కోసం టీమ్ ఎంత కష్టపడిందో దాని విజువల్స్ నుంచి సూర్య నటన వరకూ అన్నిట్లో స్పష్టంగా కనిపిస్తుంది. కొందరికి 'కంగువా' నచ్చకపోయినప్పటికీ మేం ఈ సినిమా విషయంలో గర్వపడుతున్నాం" అని చెప్పారు. ఇక భారీ బడ్జెట్తో శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచిన విషయం తెలిసిందే. 97వ ఆస్కార్ అవార్డుల్లో ఉత్తమ చిత్రం విభాగంలో 'కంగువా' పోటీ పడనుంది. దీనికి సంబంధించిన నామినేషన్ల షార్ట్ లిస్ట్ జనవరి 19న రానుంది.





## ఇంటి చిట్కాలు

### రాళ్లు కరిగించి కిడ్నీలను క్లీన్ చేసే జ్యూస్, కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం

కిడ్నీల్లో రాళ్లు ఎక్కువ కాలం ఉంటే చాలా ప్రమాదమని నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ పనితీరు మందగించి.. కిడ్నీ ఫెయిల్యూర్ ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాకుండా రాళ్లు మూత్ర నాళాన్ని బ్లాక్ చేయవచ్చు. దీంతో.. మూత్ర నిలుపుదల, ఇన్ఫెక్షన్, అధిక రక్తపోటు వంటి సమస్యలు వస్తాయి.

మూత్రపిండాల్లో రాళ్లు తీవ్రమైన, బాధాకరమైన సమస్య. ఈ రోజుల్లో కిడ్నీలో స్టోన్స్ కేసులు బాగా పెరుగుతున్నాయి. కిడ్నీ స్టోన్స్, నొప్పి, మంట, మూత్రంలో రక్తం వంటి సమస్యలు కిడ్నీ స్టోన్స్ వల్ల వస్తాయి. కిడ్నీల్లో రాళ్లు ఎక్కువ కాలం ఉంటే చాలా ప్రమాదమని నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ పనితీరు మందగించి.. కిడ్నీ ఫెయిల్యూర్ ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాకుండా రాళ్లు మూత్ర నాళాన్ని బ్లాక్ చేయవచ్చు. దీంతో.. మూత్ర నిలుపుదల, ఇన్ఫెక్షన్, అధిక రక్తపోటు వంటి సమస్యలు వస్తాయి. అయితే, సరైన ఆహారం, కొన్ని ఇంటి చిట్కాలతో కిడ్నీలో రాళ్లను తొలగించుకోవచ్చంటున్నారు నిపుణులు. అలాంటి ఒక జ్యూస్ గురించి ఇక్కడ తెలుసుకుందాం.



#### కిడ్నీలో రాళ్లను కరిగించే జ్యూస్



మూత్రంలో కాల్షియం, ఆక్సలేట్, భాస్వరం అధికంగా ఉండటం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఈ ఖనిజాలు సాధారణంగా మూత్రంలో కనిపిస్తాయి. కొన్ని ఆహారాలు, జీవన శైలి, చెడు అలవాట్లు కారణంగా ఇవి ఏర్పడతాయి. అయితే, కిడ్నీలో రాళ్లను కరిగించడానికి క్యాబేజీ జ్యూస్ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. దీని కోసం కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం, ప్రయోజనాలపై ఓ లుక్కేద్దాం.

#### క్యాబేజీతో ప్రయోజనాలు



క్యాబేజీలో ఐరన్, విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి తోడ్పడుతుంది. అంటే శరీరం నుంచి విషపదార్థాల్ని తొలగిస్తుంది. అంతేకాకుండా కిడ్నీలో పేరుకుపోయిన రాళ్ల పరిమాణాన్ని తగ్గిస్తుంది. క్యాబేజీ యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఇది కిడ్నీలో పేరుకుపోయిన రాళ్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. అదనంగా, క్యాబేజీలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరం నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తాయి.

#### క్యాబేజీ జ్యూస్ కోసం కావాల్సిన పదార్థాలు



తరిగిన తాజా క్యాబేజీ – ఒక చిన్న కప్పు
నిమ్మకాయ రసం – ఒక కాయ రసం
తేనె – ఒక టీ స్పూన్ (రుచి కోసం – ఇది ఆప్షన్ మాత్రమే)

#### ఎలా తయారుచేసుకోవాలి



**తయారీ విధానం**


- ముందుగా క్యాబేజీని శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- ఆ ముక్కల్ని ఇప్పుడు జ్యూసర్లో వేసి బాగా బ్లెండ్ చేయండి. ఆ తర్వాత ఫిల్టర్ చేసి పక్కకు తీసుకోండి.
- ఈ జ్యూసులో నిమ్మరసం, తేనె వేసి బాగా కలపండి. ఇవి కేవలం రుచి కోసం మాత్రమే. మీరు కావాలంటే పచ్చి క్యాబేజీ జ్యూసును అలానే తీసుకోవచ్చు.
- ఈ జ్యూసును ఉదయాన్నే తీసుకుంటే కిడ్నీలకు మంచిది.

#### క్యాబేజీ జ్యూస్ ఇతర ప్రయోజనాలు



కిడ్నీల్లో రాళ్లను కరిగించడమే కాకుండా క్యాబేజీ జ్యూస్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలను పొందవచ్చు. క్యాబేజీ రసం జీర్ణ సమస్యలు ఉన్నవారికి చాలా మేలు చేస్తుంది. అజీర్తి, మలబద్ధకం, గ్యాస్, ఉబ్బరం, కడుపు నొప్పి వంటి సమస్యలను తగ్గించే బెస్ట్ డ్రింక్. ఈ జ్యూస్.. శరీరంలో నీటి కొరతను భర్తీ చేస్తుంది. శరీరం నుంచి టాక్సిన్లను తొలగించడంలో క్యాబేజీ జ్యూస్ ప్రభావవంతంగా పనిచేస్తుంది.

#### నిర్లక్ష్యం వద్దు



క్యాబేజీ జ్యూస్ కిడ్నీలో రాళ్లను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది. అయితే, ఇది ఒక నివారణ అని మాత్రమే గుర్తించుకోండి. అదే రాయి పరిమాణంలో పెద్దదిగా ఉండి.. భరించలేని నొప్పిని కలిగిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహాలు తీసుకోండి. ఈ జ్యూస్ రెగ్యులర్గా తీసుకోవడం వల్ల కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవచ్చు.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.